క్లుప్తంగా

నేడు భట్టిప్రోలులో గడప గడపకు మన ప్రభుత్వం

భట్టిప్రోలు: భట్టిప్రోలు-1, 2 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం ఉదయం 7 గంటలకు, సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు గురువారం తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పాల్గొని, సంక్షేమ లబ్ధిని ఇంటింటికి తిరిగి వివరిస్తారని పేర్కొన్నారు.

10న వాసవి అమ్మవారి సారె మహోత్సవం

భట్టిప్రోలు: వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో 60 వసంతాల శ్రావణ సారె మహోత్సవం ఈ నెల 10న నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా గురువారం తెలిపారు. అమ్మవారి దేవస్థానంలో 6 దశాబ్దాల క్రితం ప్రతిష్ఠింపబడిన వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆర్య వైశ్య మహిళలు శ్రావణ మాస సారె సమర్పించనున్నట్లు చెప్పారు. ఆదిపరాశక్తి అంశతో అవతరించిన ఆర్యవైశ్యుల ఇలవేల్పు కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు. ఆ రోజు ఉదయం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి ఊరేగింపు ప్రారంభమవుతుందని తెలిపారు. అమ్మవారి పుట్టింటి వారితో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, సారె, ద్రవ్యాల శుద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ

రేపల్లె రూరల్: మండలంలోని పేటేరు గ్రామానికి చెందిన పల్లిక రాజేష్ ఆకస్మిక మృతి చెందడంతో వైఎస్సార్ బీమా వర్తించింది. మృతుడి కుటుంబానికి రూ.10వేల నగదును మట్టి ఖర్చుల నిమిత్తం గురువారం పంచాయతీ సెక్రటరీ దశరథ రామయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వార్డ్ నాయకులు కొండలు, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌కొరియా టుం ఐలవరం

– జెడ్పీ పాఠశాల విద్యార్థులకు డైరీలు



ఐలవరం(భట్టిప్రోలు): సౌత్ కొరియా నుంచి వచ్చిన డైరీలను ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు 8వ తరగతి విద్యార్థులు 40 మందికి అందజేశారు. ఆంగ్లోపాధ్యాయుడు పచ్చారు హరికృష్ణ విద్యార్థులకు డైరీ అవశ్యకతను గుర్తించి ఆన్‌లైన్‌లో పరిచయమైన సౌత్‌కొరియాలోని జేబోసిటీ హన్‌బీట్ హైస్కూల్‌లో ఆంగ్లోపాధ్యాయులుగా పని చేస్తున్న ఫెలెక్స్‌తో మాట్లాడారు. ఆయన స్వచ్ఛందంగా తమ దేశపు డైరీలను విద్యార్థులకు పంపిస్తానని చెప్పారు. ఈ మేరకు ఆయన డైరీలను గురువారం హైస్కూల్‌కు పంపారు. భవిష్యత్తులో డైరీలే కాక విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను కూడా పంపిస్తానని అందులో పొందుపరిచారు. విద్యార్థులకు ఉపయోగపడే డైరీలను పంపిన ఫెలెక్స్‌ను, ఇందుకోసం ప్రత్యేక శ్రద్ధ చూపిన హరికృష్ణను ఎంఈవోలు పి.లాజర్, నీలం దేవరాజ్ అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



సూరేపల్లి(భట్టిప్రోలు): మండలంలోని సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. యూనిట్ ఇన్‌చార్జి డి.ఝాన్సీరాణి ప్రయోగాత్మకంగా పది రకాల ఆకులతో రసాయన రహిత కషాయాన్ని తయారు చేశారు. పంటకు ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించి, కషాయాలను వాడటం వల్ల రైతులకు ఖర్చు తగ్గుతుందని తెలిపారు. అదే విధంగా ఐలవరం యూనిట్‌లో అజుల్లాఫిట్ వేశారు. ఇది వేయడం వల్ల పంట పొలాల్లో నత్రజని వృద్ధి చెందడమే కాక కలుపు రాకుండా కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐలవరం యూనిట్ ఇన్‌చార్జ్ జి. సురేష్, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

వేమూరు: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెనాలి మలేరియా వైద్యాధికారి డాక్టరు వెంకట లక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని దళితవాడలో విష జ్వరాలు ఎక్కువగా ఉండటంతో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. స్థానికంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. వర్షాల వల్ల దోమలు బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామంలో నిత్యం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది సీహెచ్ ప్రభాకర్ రెడ్డి, కె.పున్నారెడ్డి, పంచాయతీ కార్యదర్శి భూపతిరెడ్డి పాల్గొన్నారు.

నీ ఆకృతి..మా జీవన భృతి గణనాథ..!



గణనాథుని విగ్రహానికి రంగులు వేస్తున్న కార్మికుడు



సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

- వినాయక చవితి ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు
- వివిధ రూపాల్లో బొజ్జ గణపయ్య ప్రతిమలు సిద్ధం..
- గణనాథుడి విగ్రహాల తయారీనే ఆ కుటుంబాల జీవనాధారం

బాపట్ల అర్బన్ : చలువ పందిళ్లలో కొలువుదీరేందుకు గణనాథుడు సిద్ధమవుతున్నాడు. చవితికి భక్తుల పూజలందుకునేందుకు ముస్తాబవుతున్నాడు. బోలో గణేశ్ మహారాజ్‌కి అంటూ భక్తులను పారవశ్యంతో ఉర్రూతలూగించేందుకు కొలువుదీరబోతున్నాడు. ఈ నెల 18న వినాయ చవితి...ఆ రోజు మట్టి ముద్ద నుంచి కళాకారుల చేతుల్లోకి చేరి దేవదేవుడుగా అవతరించబోతున్నాడు. వినాయక రూపాలను తీర్చిదిద్దడంలో కళాకారులు తీసుకుంటున్న జాగ్రత్తలు, తయారీ విధానాల గురించి తెలుసుకుందాం.

ఊరూవాడా పండగే..

వినాయక చవితి పండుగ సందర్భంగా ఊరూవాడా గణనాథుని విగ్రహాల ఏర్పాట్లకు పండుగ నిర్వహణ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రతి వీధిలో విగ్రహాలు ప్రతిష్ఠించి, భజనలు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వివిధ ఆకృతుల విగ్రహాలకు డిమాండ్ బాగా పెరిగింది. ఈ విగ్రహాల తయారీలో కళాకారులు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విగ్రహం తయారీకి మట్టి సేకరణ నుంచి రంగుల వరకు ఎంతో శ్రద్ధ పెడుతున్నారు. ముఖ్యంగా విగ్రహాల తయారీకి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినియోగిస్తారు. దీంతోపాటు పీచు, రంగులు ఉంటాయి. ఒక విగ్రహం తయారీకి సుమారు ఎనిమిది మంది కూలీలు పని చేస్తారు. విగ్రహం పూర్తి కావడానికి ఐదు నుంచి వారం రోజుల వ్యవధి తీసుకుంటామని తయారీదారులు చెబుతున్నారు.

పెరిగిన ఖర్చులు

గతంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ బస్తా రూ.150కు దొరికేదని, ఇప్పుడు దీని విలువ రూ.300 పెరిగిందని తయారీదారులు అంటున్నారు. విగ్రహాల తయారీని ఆరు నెలల ముందు నుంచే ప్రారంభిస్తారు. అప్పటి నుంచి తయారు చేస్తేనే వినాయక చవితి సమయానికి విక్రయానికి సిద్ధం వర్షాలు కురిసినప్పుడు కొంత ఇబ్బందులు పడుతున్నామనిచెబుతున్నా.. మొత్తంగా కూలి గిట్టుబాటవుతుందని అంటున్నారు.

ఇప్పుడిప్పుడే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి



ఆరు నెలల ముందు నుంచి విగ్రహాల తయారీ ప్రారంభించాం. చాలా వరకు వివిధ ఆకృతుల్లో సిద్ధం చేశాం. కొనుగోలుదారులు అడ్వాన్సులు ఇచ్చి వెళుతున్నారు. మొత్తం పది రకాల ఆకృతుల్లో విగ్రహాలను రూపొందిస్తున్నాం.

– కొటేవరపు విజయ్ కుమార్, తయారీదారు, బాపట్ల.

ధరలు బాగా పెరిగాయి



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ద్వారా విగ్రహాలు తయారీ చేస్తున్నాం. ఇది మాకు వంశ పారంపర్యంగా అందించిన విద్య. వినాయక విగ్రహాలు తయారు చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం. కొనుగోలుదారుల అభిరుచికి అనుగుణంగా విగ్రహాల తయారీకి ప్రయత్నిస్తున్నాం.

– రజనీకుమార్, తయారీదారు, బాపట్ల.

ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



కొల్లూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో కృష్ణుడి ప్రతిమకు క్షీరాభిషేకం



భట్టిప్రోలు సాధన మండలిలో గో పూజ



రేపల్లె ఓల్డ్ టౌన్‌లో పూజలందుకున్న వేణుగోపాలస్వామి

భట్టిప్రోలు: అద్దేపల్లిలోని సంతాన వేణుగోపాల స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ యాదవ సేవాసమితీ ఆధ్వర్యంలో గురువారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కృష్ణాష్టమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో అలరించారు.

- వెల్లటూరులోని గీతా జ్ఞాన మందిరంలో గురువారం శ్రీ కృష్ణాష్టమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాన్ని వేములపల్లి వనజాక్షమ్మ పర్యవేక్షించారు. శ్రావణ మాసం పురస్కరించుకుని వెల్లటూరు గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ, శ్రీ కట్లమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవార్ల దేవాలయంలో అర్చకులు క్రోవి రామకృష్ణ పూజలు నిర్వహించారు.
- భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకుని గురువారం గో పూజ, శ్రీకృష్ణ పరమాత్మునికి అభిషేకాలు నిర్వహించారు. మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీ కృష్ణ భగవానుని లీలలు, చరిత్రను భక్తులకు యల్లాప్రగడ సీతాపతి తెలియ చేశారు. సాధన మండలి అధ్యక్షుడు బూర్లె అరుణకుమారి పర్యవేక్షించారు. నిర్వాహకులు బండి వెంకట్రావు, చుండూరు బాబు, గేదెల మల్లికార్జునరావు, జంజనం హేమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.
- కొల్లూరు : కృష్ణాష్టమి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. కొల్లూరులోని వెంకటేశ్వర స్వామి, వైష్ణవాలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేకాలు జరిపారు. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కృష్ణనగర్, బొద్దులూరుపాడు శ్రీకృష్ణుడి ఆలయాల్లో కృష్ణాష్టమిని పూజలు నిర్వహించారు.
- పిట్టలవానిపాలెం: మండలంలోని సంగుపాలెం కోడూరు గ్రామంలోని శ్రీకృష్ణుని దేవాలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్టి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టారు. పారె ధనుంజయ యాదవ్, గ్రామంలోని యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
- రేపల్లె: పట్టణంలోని పలు వైష్ణ వాలయాలలో శ్రీకృష్ణాష్టమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైలుపేటలోని పట్టాభిరామస్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు వేడుకలు నిర్వహించారు. రుక్మిణి సత్యభామ సమేత మురళీకృష్ణ స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పట్టువస్త్రాలు, పువ్వులతో అలంకరించారు. సాయంత్రం ఉట్టి కార్యక్రమంతో పాటు ఆలయంలో సహస్ర దీపాలంకరణను భక్తులతో చేయించారు. స్వామివారికి ఊంజల సేవ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తటవర్తి రాధికారాణి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఓల్డ్‌టౌన్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు మంజూరు

ఎమ్మెల్యే కోన రఘుపతి



కొత్తగా మంజూరైన పింఛను పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందించటమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకుపోతోందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల మున్సిపాల్టీలో 283మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు కావటంతో పత్రాలను లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం అందిస్తూ పాలన కొనసాగుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఉన్న పెన్షన్లు తొలగించేందుకు ఎక్కువ సమయం కేటాయిస్తే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హత ఉండి, రాని వారికి ఏ విధంగా పింఛన్లు ఇవ్వాలా అని ఆలోచిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, కాగిత యర్రయ్య, చింతల రాజశేఖర్, ఇనగలూరి మాల్యాద్రి, శాయిల మురళి, చల్లా రామయ్య పాల్గొన్నారు.

వర్షపు నీరు తొలగింపు

కర్లపాలెం: వీధుల్లో వర్షం నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నక్కా లలితకుమారి పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని బంగారురెడ్డిపాలెంలో సిమెంటు రహదారిపై నిలిచి ఉన్న వర్షం నీటిని కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ప్రొక్లెయిన్ ద్వారా సైడు కాలువ తవ్వించి, తొలగించే పనులు చేపట్టారు. సర్పంచ్ లలితకుమారి మాట్లాడుతూ గ్రామంలో సిమెంటు రహదారులకిరువైపులా సైడు కాలువలు లేకపోవటం వల్ల వర్షం నీరు రోడ్లపై నిలిచి ఉంటున్నట్లు తెలిపారు. సైడు కాలువలు తవ్వేందుకు సంబంధిత అధికారులు నిధులు మంజూరు చేయాలని కోరారు.



బంగారురెడ్డిపాలెంలో వర్షం నీటి తొలగింపు చర్యలు

పంట కాల్వల క్రమబద్ధీకరణ చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె: ఇరిగిషన్ కాల్వలు, డ్రెయిన్లు మరమ్మతులు చేపట్టి.. పంటలను కాపాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డెల్టా ప్రాంతం రేపల్లె నియోజవర్గంలో దిగువ భూముల్లో వరి పంటకి సాగునీరు అందటం లేదని, డ్రెయిన్లు పారుదల లేకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి పంట కాల్వలలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించటంతో పాటు మురుగు కాల్వలు పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు కె.ఆశీర్వాదం, కె.గోపీ, రమేష్ పాల్గొన్నారు.

హోటళ్లు, రేషన్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



కర్లపాలెం: అవకతవకలకు పాల్పడే వారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయిస్ డీటీ ఓంకార్ హెచ్చరించారు. గురువారం రాత్రి సివిల్ సప్లయిస్, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా కర్లపాలెంలోని పలు రేషన్ దుకాణాలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో గృహ వినియోగానికి వాడాల్సిన గ్యాస్ సిలిండర్లను హోటళ్లలో వినియోగించటం గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. 10వ నంబర్ రేషన్ దుకాణంలో ఆరు బస్తాలు, 12వ నంబర్ షాపులో 16 బస్తాల రేషన్ అవకతవకలు జరిగినట్లు గుర్తించి, కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐలు శ్రీహరి, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

స్కూల్ వ్యాన్ ఢీకొని వ్యక్తికి గాయాలు



కొల్లూరు : స్కూల్ వ్యాన్ ఢీకొనడడంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన కొల్లూరు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కొల్లిపర మండలం గుందిబండివారిపాలేనికి చెందిన గుంటూరు పురుషోత్తం కొల్లూరు మండలంలోని తన అత్తగారి గ్రామం ఆలపాటినగరానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. కొల్లూరు దాటిన అనంతరం దోనేపూడి వైపు నుంచి విద్యార్థులను దింపి వస్తున్న ఓ ప్రవేటు పాఠశాలకు చెందిన బస్సు తగలడంతో అదుపు కోల్పోయి రోడ్డుపై పడిపోయాడు. పురుషోత్తం తలకు తీవ్ర గాయమైంది. అతనిని 108 అంబులెన్స్‌లో తెనాలి వైద్యశాలకు తరలించారు. పాఠశాల వాహనాన్ని కొల్లూరు ఎస్ఐ జి. రాజ్యలక్ష్మి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ప్రమాదంపై వైద్యశాల నుంచి వచ్చే నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు జరపనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- భట్టిప్రోలులో కొనసాగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి నాగార్జున

భట్టిప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకెళ్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలు సచివాలయం పరిధిలో గురువారం 4వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున గడప గడపకు వెళ్లి వివిధ సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులందరూ పథకాలన్నీ పారదర్శకంగా అందాయని తెలిపారు.

జగనన్నకు అండగా నిలబడండి

ప్రతి హామీని నెరవేర్చామని...మాటకు కట్టుబడి పని చేశామని మంత్రి నాగార్జున ఈ సందర్భంగా తెలిపారు. జగనన్నకు అండగా నిలబడి, తమను ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. ప్రభుత్వంపై కావాలని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. చంద్రబాబును నెత్తికెత్తుకున్న ఎల్లో మీడియాకు సిగ్గులేదని విమర్శించారు. ఎల్లో మీడియా అబద్ధపు రాతలతో చంద్రబాబుకు ఒక్క సీటు కూడా రాదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మండల జేసీఎస్ కన్వీనర్ పీఎసీఎస్ చైర్ పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, ఉప సర్పంచ్ బూర్లె రామ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు డొక్కు నాగ కుమారి, బండారు శ్రీనివాసరావు, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్, పార్టీ యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి, పట్టణ అధ్యక్షుడు కుందేటి రమేష్, వేల్పూరి చిన్నారి, వేల్పూరి నాగేశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యులు గోలి శ్రీనివాసరావు, పెరికల శ్యామ్, కనపర్తి శ్రీనివాసరావు, కుక్కల వెంకట్రామయ్య, అబ్దుల్ కరీం, కుక్కల భూషణరావు, కట్టా నాగరాజు, తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ బి. ఉషారాణి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అదనపులోడు అపరాధ రుసుం రూ.4.73 లక్షలు

మండలంలో విద్యుత్ శాఖ అధికారుల తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

పిట్టలవానిపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం విద్యుత్ శాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ అదనపు లోడు వినియోగిస్తున్న పలువురి వినియోగదారులపై కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం విధించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధికారులు వివరాలు వెల్లడించారు. మొత్తం 42 బృందాలుగా అన్ని గ్రామాలలో తనిఖీ చేసినట్లు తెలిపారు. 108 విద్యుత్ సర్వీసుదారులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లుగా గుర్తించి, వారికి అపరాధ రుసుం రూ.4.73 లక్షలు విధించినట్లు చెప్పారు. ఈ తనిఖీలలో బాపట్ల డివిజన్ ఈఈ జి.ఆంజనేయులు, విజిలెన్సు ఈఈ సీహెచ్‌ఎల్ఎన్ మూర్తి, విజిలెన్సు డీఈఈపీ వీఆర్. మల్లికార్జున్, విద్యుత్ శాఖ మండల ఏఈ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కార్యకర్తలు



మంత్రి నాగార్జున సమక్షంలో పార్టీలో చేరిన తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు

వేమూరు: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వేమూరు మండల కేంద్రం అంబేద్కర్ నగర్‌లోని టీడీపీకి చెందిన పాముల అనిల్ సమక్షంలో పదిమంది కార్యకర్తలను గురువారం కొల్లూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంత్రి నాగార్జున కండవాలు వేసి వైఎస్సార్ సీపీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి పార్టీలో చేరామన్నారు. వైఎస్సార్ సీపీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, మండలాధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షుడు గాజుల భాను ప్రకాష్, దున్నా మేరీసుబాబు, యల్లమాటి సుధాకర్ కత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు. భట్టిప్రోలు మండల కేంద్రంలోని అదేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కసుకుర్తి బసవయ్య మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ ఉదయ్ భాస్కరి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న తహసీల్దారు నెహ్రూబాబు

నిజాంపట్నం: పౌష్టికాహారంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దారు నెహ్రూబాబు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తక్కువ ఖర్చుతో స్థానికంగా దొరికే పదార్థాలతో పౌష్టికాహారాన్ని తయారీ విధానాన్ని వివరించారు. ఎంపీడీవో నాగలక్ష్మి, ఎంఈవో శేషుగోపాల్, సీడీపీఓ అనసూయ, ఈవో పీఆర్డీ సునీత, మండల ఉపాధ్యాక్షులు తోటకూర సుబ్బారావు, సూపర్‌వైజర్ ప్రసన్న పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

కర్లపాలెం: పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీపీ యారం వనజ అన్నారు. కర్లపాలెం పంచాయతీ తారకరామా నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఎంపీపీతో పాటు ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి పాల్గొని, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. సీమంతం జరుపుకున్న గర్భిణులను అక్షింతలు వేసి, దీవించారు. ఈ సందర్భంగా సీడీపీవో శైలజ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. ఈవోపీఆర్డీ పీడీఎస్ ఎలీషా బాబు, ఏపీఎం శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీలు ఆసిఫ్ అలీ, కంకిపాటి హైమావతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలు విస్తృతం



వ్యవస్థాపక దినోత్సవంలో సీనియర్ మేనేజర్ శివనాగేశ్వరరావు, సిబ్బంది

బాపట్ల: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంక్ సేవలను విస్తృతం చేస్తామని బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ శివనాగేశ వరరావు పేర్కొన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా 118వ వ్యవస్థాపక దినోత్సవాన్ని స్థానిక బ్రాంచ్‌లో గురువారం నిర్వహించుకున్నారు. ఖాతాదారులకు బ్యాంకు సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు పగడాల సాయిబాబు, ఆలపర్తి శ్రీనివాసరావు, అద్దంకి విజయ్, వేణుగోపాలరావు, ఇక్కుర్తి రాజేశ్వరరావు ఉన్నారు.